క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చందర్

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ మాజీ కార్పొరేటర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్‌తోపాటు 100 మంది కార్యకర్తలు బుధవారం రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే కాంగ్రెస్ నాయకుడు లావుడ్య సమ్మయ్య పార్టీలో చేరగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి ఆహ్వానించారు. కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



నాయకులతో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

పాలకుర్తి: పాలకుర్తి మండలం బామ్లానాయక్ తండా గ్రామ బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. ఉమ్మడి కన్నాల గ్రామ మాజీ సర్పంచ్ ఇస్లావత్ లాల్‌సింగ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బదావత్ అంజినాయక్, ఉపాధ్యక్షుడు బదావత్ రాజునాయక్, బదావత్ సమ్మయ్య, నగావత్ రాజు, కోఆప్షన్ సభ్యులు దరావత్ వసిరామ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సూర సమ్మయ్య ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కాగా వారికి ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

లీకేజీ కాకుండా చర్యలు

సుల్తానాబాద్: రక్షిత మంచినీటి పైపులైన్ లీకేజీ కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. పట్టణంలో బుధవారం లీకేజీ పైపులైన్‌ను సిబ్బందితో మరమ్మతు చేయించారు. కాలనీల్లో లీకేజీ అయితే వెంటనే మున్సిపల్ శానిటేషన్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు.

అలయన్స్ క్లబ్ అధ్యక్షుడికి సన్మానం

ధర్మారం: ధర్మారం మండలం ఎర్రగుంటపల్లికి చెందిన అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొత్త మోహన్‌ను మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం సన్మానించారు. మోహన్ ఇటీవల న్యూఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ ఆడిటోరియంలో సేవారత్న జాతీయ స్పెషల్ అవార్డు పొందిన సందర్భంగా ఆయనను మంత్రి సన్మానించారు. పాలకుర్తి ఎంపీపీ అనసూయ, వెల్గటూర్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జగన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు వీరే

ఓదెల: మండలంలోని కనగర్తి దాసరి పద్మహన్మయ్య హైస్కూలుకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీలో జరిగిన క్రీడల్లో ఉత్తమప్రతిభ కనబరిచారు. వేల్పుల అక్షయ (షాట్‌పుట్–గోల్డ్ మెడల్), గుంటి కావ్య (రన్నింగ్–గోల్డ్‌మెడల్), రాయిల్ల కల్యాణి(లాంగ్‌జంప్–గోల్డ్‌మెడల్), రాదండి అశ్విత్(లాంగ్‌జంప్–గోల్డ్‌మెడల్), దొడ్డి కార్తీక్(రన్నింగ్–గోల్డ్‌మెడల్), పిట్టల అరుణ్‌కుమార్(సిల్వర్ మెడల్) సాధించినట్లు పీఈటీ జె.విష్ణు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను సర్పంచు కోట దామోదర్‌రెడ్డి, ఎంపీటీసీ ఆరెల్లి సరోజన, ఎంఈవో ఆరెపల్లి రాజన్న అభినందించారు.

సమాజానికి దిశా నిర్దేశకులు స్త్రీలు

మంథని: కుటుంబానికి, సమాజానికి దిశా నిర్దేశకులు స్త్రీలని హైదరాబాద్, కరీంనగర్‌కు చెందిన పాస్టర్లు విజయ అగస్టిన్, మంజుల సుధాకర్ అన్నారు. మంథనిలోని సీయోను ప్రార్థన మందిరంలో బుధవారం ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా, ఫెలోషిప్ ఆఫ్ ఎవంజలికల్ చర్చీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 43వ క్రైస్తవ స్త్రీల వార్షికోత్సవ మహాసభలకు వారు హాజరయ్యారు. కుటుంబాన్ని ఆధ్యాత్మిక చింతనలో నడిపించాల్సిన బాధ్యత స్త్రీలదే అన్నారు. సీయోను స్త్రీల సమాజం నాయకులు ఎంకె హేమలత అధ్యక్షత వహించగా మంథని మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు అంకరి పద్మజా కుమార్, స్త్రీల కమిటీ నాయకులు వాసాల పెర్సిస్ డేవిడ్, సొల్ల ప్రేమలత, రామగిరి సువార్త కుమార్ పాల్గొన్నారు.



రామగుండం: షిర్డీసాయి ఆలయ ప్రాంగణంలో..



ఫెర్టిలైజర్‌సిటీ: రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కుంకుమ పూజ



పెద్దపల్లిరూరల్: మండపంలో పూజలు



ఎలిగేడులో..



జూలపల్లి: పూజల్లో గ్రంథాలయ చైర్మన్

ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు

రామగుండం: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలోని శ్రీషిర్డీసాయి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీదుర్గామాత గజలక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.

జూలపల్లి: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, సతీమణి మాజీ ఎంపీపీ ప్రీతిసింగ్ ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు దారబోయిన నర్సింహయాదవ్ భక్తులకు అన్నదానం చేశారు.

ఎలిగేడు: మండలంలో దేవీశరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన దుర్గామాత బుధవారం అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారు శ్రీకూష్మాండ దేవి అవతారంలో దర్శనమిచ్చారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి లో దుర్గామాత నవ రాత్రోత్సవాలను జరుపుకుంటున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్నారు.

ఫెర్టిలైజర్‌సిటీ: దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఆర్ఎఫ్‌సీఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అమ్మవారు బాలత్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు.

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్, కూనారం, కిష్టంపేట గ్రామాల్లో దుర్గాదేవి మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. దుర్గాదేవి మండపాల్లో దాతలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సంబురంగా బతుకమ్మ వేడుకలు



సుల్తానాబాద్: వివేకానందపురి కాలనీలో బతుకమ్మతో మహిళలు



రామగుండం: బతుకమ్మ ఆడుతున్న వైద్యసిబ్బంది



గోదావరిఖనిటౌన్: ప్రభుత్వ కళాశాలలో..



పెద్దపల్లిరూరల్: ట్రినిటి కళాశాలలో..

సుల్తానాబాద్(పెద్దపల్లి): సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ వెనుక వివేకానందపురి కాలనీలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిరోజూ కాలనీకి చెందిన మహిళలు అందంగా బతుకమ్మలు పేర్చి సాయంత్రం బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటాలతో నత్యం చేస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలలో..

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.

ముత్తారం: ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ ఆడారు.

రామగుండం: అబాది రామగుండంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (మహిళా ఆరోగ్య కేంద్రం)లో బుధవారం బతుకమ్మ ఆడారు.

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి కాలేజీలో బుధవారం బతుకమ్మ సంబరాలతో పాటు ఫుడ్ ఫెస్టివల్, ట్రెడిషనల్ డే నిర్వహించారు. వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు.

రేపు ఓటరు అవగాహన ర్యాలీ



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్

కోల్‌సిటీ: స్వీప్ కార్యక్రమంలో భాగంగా రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో 20వ తేదీన శుక్రవారం ఓటరు అవగాహన భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్ తెలిపారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావుతో కలిసి బుధవారం మెప్మా విభాగం ఆర్పీలు, స్వశక్తి మహిళా సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బుధవారం ఉదయం రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి గోదావరిఖని గాంధీచౌక్ చౌరస్తా వరకు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించనుననట్లు పేర్కొన్నారు. ర్యాలీలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అరుణశ్రీ పాల్గొంటారని తెలిపారు. ర్యాలీలో స్వశక్తి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలని కోరారు. సమావేశంలో మెప్మా డీపీఎం పీడీ రజినీతోపాటు టీఎంసీ శ్వేత, సీఓలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను చిత్తుగా ఓడించాలి



మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిరూరల్: రాష్ట్రంలో అవినీతి, కుటుంబపాలన సాగిస్తున్న బీఆర్ఎస్ సర్కార్‌ను ఈసారి జరిగే ఎన్నికల్లో చిత్తుగా ఓడించి సాగనంపుదామని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. పెద్దపల్లిలో మాజీ ఎమ్మెల్యే కాశిపేట లింగయ్యతో కలిసి బుధవారం పట్టణ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమై మాట్లాడారు. కొందరు నాయకులు బీజేపీలో చేరకుండానే తమకు పార్టీ అధిష్టానం టిక్కెట్లు హామీ ఇచ్చిందంటూ కార్యకర్తల్లో అయోమయాన్ని సృష్టించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. పార్టీ అధిష్టానం ఆదేశాలను విధేయులుగా పాటిస్తామని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు ఠాకూర్ రాంసింగ్, పిన్నింటి రాజు, జంగ చక్రధర్‌రెడ్డి, శ్రీనివాసరావు, సమ్మయ్య, తూడి రవీందర్, ఫహీం, రమేశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం సబ్బితం, కాల్వశ్రీరాంపూర్ మండలం ఆశన్నపల్లి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. పెద్దపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు శ్రీకాంత్, సంజీవ్, సురేశ్, నరేశ్, కనకయ్య, సంతోష్, వెంకటాచారి, నారాయణ, లక్ష్మీరాజం ఉన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఆశన్నపల్లెకు చెందిన పలువురు బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. గ్రామానికి చెందిన మంద సంజీవులు, కూస తిరుపతి, కదురు రాజయ్య, పెండ్లి శ్రీకాంత్, సురేశ్, ఎరుకల సంజీవ్, మిడిదొడ్డి శ్రీకాంత్‌కు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. సర్పంచు మంద రమ, ఉప సర్పంచు రాజిరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయరమణారావు

ఎలిగేడు/కాల్వశ్రీరాంపూర్: మండలంలోని శివపల్లిలో మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు నివాసంలో కాల్వశ్రీరాంపూర్ మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్, బీజేపీల నుంచి కాంగ్రెస్‌లో చేరారు. కాల్వశ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామానికి చెందిన మేడి తిరుపతిగౌడ్(ఉపసర్పంచ్), మేడి శ్రీనివాస్‌గౌడ్(రైతుసమన్వయసమితి సభ్యులు) మేడి సదానందం, మేడి సతీశ్, రవి, పెగడపల్లి గ్రామానికి చెందిన చలిగంటి లలిత రామచంద్రం, చలిగంటి యాదగిరి, సతీశ్, నరహరి, కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన రాజు, మీర్జంపేటకు చెందిన ఉయ్యాల రాకేశ్, ఉయ్యాల సుమన్, వంశీ, మహేశ్, సురేశ్, తిప్పని సతీశ్, సాయికుమార్, ప్రవీణ్, బత్తిని రాజు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యకర్తలు ఐక్యంగా ఉండాలి

యైటింక్లయిన్‌కాలనీ: కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండి పార్టీని గెలిపించాలని పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ మారెల్లి రాజిరెడ్డి కోరారు. బుధవారం కాలనీ ప్రెస్ భవన్‌లో ఆయన మాట్లాడారు. కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, అక్బర్ అలీ, దేవనపల్లి చక్రపాణి, వీరారెడ్డి, సల్లావుద్దీన్, రాజు, రాములు, తిరుపతి, అవినాష్, తిరుపతిరెడ్డి, కిషన్ నాయక్, సారయ్య నాయక్, రాకేశ్, మార్కండేయ, సదానందం, తిరుపతి, నరేశ్, అక్బర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బతుకమ్మ వేడుకలు సంబురంగా జరుపుకోవాలి

ఓదెల: బతుకమ్మ వేడుకలను మహిళలు సంబురంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి కోరారు. రూపునారాయణపేట, శానగొండ, మడక, ఓదెలలో బతుకమ్మ వేడుకలను డీపీవో బుధవారం తనిఖీ చేశారు. ఎంపీడీవో సత్తయ్య, ఎంపీవో వాజీద్, కార్యదర్శులు దిలీప్, శ్రీనివాస్, కిరణ్ పాల్గొన్నారు.

భోజన్నపేటలో న్యాయవిజ్ఞాన సదస్సు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం భోజన్నపేటలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్‌జడ్జి అర్జున్ మాట్లాడుతూ ఎవరైనా మరొకరికి అప్పుగా ఇస్తే ప్రామిసరీ నోట్ రాయించుకోవాలన్నారు. ఈ ప్రామిసరీ నోటు గడువు మూడేళ్లు ఉంటుందని తెలిపారు. ఉచిత న్యాయ సేవలు పొందేందుకు అవకాశముందన్నారు. సర్పంచ్ మేకల మల్లేశ్, న్యాయవాదులు శ్రీనివాస్, ఠాకూర్ హన్మాన్‌సింగ్, శంకరయ్య, నరేశ్, ఎస్సై మల్లేశ్ పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్ బస్టాండ్ వద్ద బుధవారం విద్యుత్ వినియోగదారులకు డిజిటల్ చెల్లింపులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల ట్రాన్స్‌కో ఏఈ వంశీకృష్ణ వినియోగదారులకు మొబైల్ ఫోన్‌లో పేటీఎం, ఫోన్ పే, గూగుల్ పే తదితర యాప్‌ల ద్వారా విద్యుత్ బిల్లులు ఏవిధంగా చెల్లించవచ్చు అనే విషయంపై వివరించారు. పాలకుర్తి సర్పంచ్ దుర్గం జగన్, కమలాకర్, సంజీవ్ పాల్గొన్నారు.

ధర్మసమాజ్ పార్టీ మంథని ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్రీనివాస్

మంథని: ధర్మసమాజ్ పార్టీ మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా చిట్యాల శ్రీనివాస్‌ను రాష్ట్ర అధ్యక్షుడు డా.విశారదన్ మహరాజ్ హైదరాబాద్‌లో ప్రకటించారు. అగ్రకుల కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మోసపూరిత హామీలను ప్రజాక్షేత్రం ఎన్నికల్లో ఎండగడతామని శ్రీనివాస్ తెలిపారు.

సభ విజయవంతం చేయాలి

సుల్తానాబాద్: పెద్దపల్లిలో గురువరం జరిగే సభ విజయవంతం చేయాలని కోరుతూ సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో వార్డు కౌన్సిలర్ వరప్రదీప్ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం జరిగింది. నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సామాన్యులకు బీజేపీ టికెట్ ఇచ్చింది

సుల్తానాబాద్: బీజేపీ సామన్యులకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చిందని, పెద్దపల్లి నియోజకవర్గంలో 19ఏళ్లుగా చేస్తున్న సామజిక సేవా కార్యక్రమాలను గుర్తించి తనకు బీజేపీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని సామాజిక కార్యకర్త ఏగోలపు సదయ్యగౌడ్ కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ నాయకులు అమరగాని ప్రదీప్‌కుమార్‌గౌడ్, ముస్కు విజయ్, శ్రీకాంత్, వీరగోని కిరణ్‌గౌడ్, రంజిత్, అజయ్, మంద అన్వేష్, ఇల్లందుల అంజిగౌడ్, గౌడసంఘం నాయకులు బాలుసాని శ్రీనివాస్‌గౌడ్, తాళ్ల తిరుపతిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మణికంఠగౌడ్ పాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలి

జూలపల్లి: మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం లేకపోవడంతో గ్రామీణ ప్రజలు తిప్పలు పడుతున్నారని మీకోసం ఫౌండేషన్ అధ్యక్షుడు కోడూరి మహేశ్ అన్నారు. ఈ విషయమై బుధవారం తహసీల్దారు బషీరోద్దీన్‌కు ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఫక్రుద్దీన్, ఇమామ్, సల్మాన్, రషీద్, అబ్దుల్ మోహిత్, తౌఫిక్ ఉన్నారు.

న్యూఇండియా పార్టీతోనే ఆర్థిక స్వేచ్ఛ

రామగుండం: న్యూఇండియా పార్టీతోనే ఆర్థిక స్వేచ్ఛ సాధ్యమవుతుందని పార్టీ రామగుండం అభ్యర్థి వేముల అశోక్ అన్నారు. ఈ మేరకు బుధవారం అంతర్గాం ప్రెస్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రామగుండం నియోజకవర్గ అభ్యర్థిగా అశోక్‌ను పార్టీ వ్యవస్థాపకుడు జేపీ.రాజు ప్రకటించారు. పార్టీ ప్రతినిధులు జనగామ లక్ష్మీనారాయణ, జనగామ తిరుపతి, ఎం.తిరుపతి ఉన్నారు.

డైరెక్టర్(పా)కు పరామర్శ

గోదావరిఖని: సింగరేణి డైరెక్టర్ బలరాంనాయక్‌ను బుధవారం దళిత సంఘాల నాయకులు పరామర్శించారు. తండ్రి హనుమంతు నాయక్ 15న ఆకస్మిక మరణం చెందడంతో మహబూబ్‌నగర్ జిల్లా, తిరుమలగిరిలో డైరెక్టర్(పా)ను కలిశారు. హన్మంతునాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేశ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ జిల్లా కమిటీ సభ్యులు బొంకూరి మధు, తెలంగాణ అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ వైస్‌చైర్మన్ అడకపురం చంద్రమౌళి ఉన్నారు.

బీసీ నాయకులు బీఎస్పీలోకి రావాలి



ఓదెల: ఓటు అభ్యర్థిస్తున్న దాసరి ఉష

ఓదెల: పెద్దపల్లిలోని బీసీ నాయకులందరూ బీఎస్పీలోకి రావాలని పార్టీ పెద్దపల్లి అభ్యర్థి దాసరి ఉష కోరారు. మండలంలోని కొలనూర్‌లో ఇంటింటా తిరుగుతూ ఏనుగు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ అగ్రవర్ణాల పార్టీలని అందులో బీసీలకు సముచిత న్యాయం జరగదన్నారు. ఓదెల జెడ్పీటీసీ గంట రాములుయాదవ్, నాయకులు వేముల రామ్మూర్తి కాంగ్రెస్‌కు రాజీనామా చేయడం చక్కటి నిర్ణయం అన్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు చేస్తున్న దోపిడీ విధానం ఎండగట్టాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ఏనుగు గుర్తుకు ఓటేసి గెలిపించాలన్నారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గొట్టె రాజు, జిల్లా మహిళా కన్వీనర్ పూరెల్ల స్వప్నగౌడ్, కార్యవర్గ సభ్యులు కాంపల్లి బాబు, అసెంబ్లీ కోశాధికారి ఎండీ రియాజ్, నాయకులు సాత్తూరి రాజేశం, అనిల్, కాసర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బహుజనులకు భరోసానిచ్చే బీఎస్పీ మేనిఫెస్టో

సుల్తానాబాద్(పెద్దపల్లి): బీఎస్పీ మేనిఫెస్టో బహుజనులకు భరోసానిస్తుందని పార్టీ బీఎస్పీ పెద్దపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి దాసరి ఉష అన్నారు. పట్టణంలోని 13, 14వ వార్డు పూసాలలో బుధవారం మన ఊరు మన ఉష కార్యక్రమం నిర్వహించారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే అందించే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్, అసెంబ్లీ కోశాధికారి ఎండీ రియాజ్, మండల కోశాధికారి అల్లెపు చంద్రశేఖర్, బరిగల సంజీవ్, రోహిత్, కందుల మంగ, కొలిపాక లత పాల్గొన్నారు.

‘బాపును మళ్లీ గెలిపిస్తాం బిడ్డా’



ప్రశాంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు



ఓటు అభ్యర్థిస్తున్న దాసరి సతీమణి పుష్పలత

కాల్వశ్రీరాంపూర్: ‘బాపును మూడోసారి గెలిపించుకుంటాం బిడ్డా..మాట ఇస్తున్నాం తప్పేది లేదు’ అంటూ మండలంలోని పెద్దంపేట గ్రామస్తులు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తనయుడు ప్రశాంత్‌రెడ్డితో అన్నారు. మండలంలోని పెద్దంపేట, లక్ష్మీపురం, ఇదులాపూర్ గ్రామాల్లో బుధవారం ప్రశాంత్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కు ఓటేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఆయా గ్రామాల ప్రజలు ఆయనకు స్వాగతం పలికారు. ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, సర్పంచులు బండ రవీందర్‌రెడ్డి, దొంతరవేన రజిత, ఓదెల రవీందర్, నాయకులు కుమార్, మోహన్‌యాదవ్, దర్ముల రవి, శ్రీకాంత్, రాజేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తో బంగారు తెలంగాణ

జూలపల్లి: సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన బీఆర్ఎస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సతీమణి దాసరి పుష్పలత అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి, వైస్ ఎంపీపీ మొగురం రమేశ్, మహిళలతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ కత్తెర్ల శ్రీనివాస్, నాడెం మల్లారెడ్డి, అరుణ్, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు చుక్కరెడ్డి, అడప లక్ష్మన్, గడ్డమీది శ్రీనివాస్, రాంగోపాల్‌రెడ్డి, వెంకటేశ్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో ఇంటింటా ప్రచారం..

సుల్తానాబాద్: పెద్దపల్లిలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని టీజేఏసీ విద్యార్థి సంఘం జిల్లా కోకన్వీనర్ సూర శ్యాం కోరారు. సుల్తానాబాద్‌లోని శాస్త్రినగర్‌లో బుధవారం బీఆర్ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్‌రెడ్డి గెలుపుకోసం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్లు పసెడ్ల మమత, గుర్రాల శ్రీనివాస్, కూకట్ల గోపి, ముత్యం రమేశ్‌గౌడ్, సంపత్, సాజిద్ పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న మహిళ



తిరుపతికి బంగారు ఉంగరం అందజేస్తున్న స్వప్న

ముత్తారం: ముత్తారానికి చెందిన గుడి స్వప్న తనకు దొరికిన తులం బంగారాన్ని మంథనికి చెందిన హోల్‌సేల్ దుకాణాదారుడు కొమురవెల్లి తిరుపతికి బుధవారం అందజేసి నిజాయితీని చాటుకుంది. గుడి స్వప్న అనే మహిళ ముత్తారంలోని కాసర్లగడ్డ బస్టాండ్‌లో బండిమీద కూరగాయలు అమ్ముతుంది. మంథనికి వెళ్లి హోల్‌సెల్ దుకాణాల్లో కొనుగోలు చేసిన కూరగాయలు కవర్లలో ప్యాక్ చేస్తుండగా తిరుపతి అనే వ్యక్తి తులం బంగారం రింగ్ పడిపోయింది. తిరుపతి ఫోన్ ద్వారా తన రింగు ఏమైనా కవరులో పడిందో చూడమని అడగగా స్వప్న ప్యాకింగ్ కవర్లు వెతికి దొరికిందని చెప్పింది. బుధవారం సాయంత్రం ముత్తారానికి వచ్చిన తిరుపతికి దొరికిన బంగారాన్ని అందజేసింది. ఈ మేరకు స్వప్నను స్థానికులు అభినందించారు.

ఎన్నికల నియమావళి అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీవో హనుమనాయక్

రామగిరి: మంథని నియోజకవర్గంలో ఎన్నికల నియమావళి అమలు చేయాలని ఆర్డీవో హనుమనాయక్ అన్నారు. స్థానిక జెఎన్టీయూ కళాశాలలో బుధవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో, ఎన్నికల పర్యవేక్షణ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతవరణంలో ఎన్నికలు జరగాలని, ప్రతి అంశం ఎన్నికల నిబంధనలకు లోబడి ఉంటుందన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల కోడ్ వచ్చిన నేపథ్యంలో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధం కావాలన్నారు.